క్లుప్తంగా

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా

- కచ్చితంగా గెలుపు నాదే
- జగనన్న సంక్షేమ పథకాలే అందుకు పునాది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో హోం మంత్రి తానేటి వనిత


తానేటి వనిత, రాష్ట్ర హోం శాఖ మంత్రి

దేవరపల్లి: 'మీ ఇంటి ఆడబిడ్డగా ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాభివృద్ధికి కృషి చేస్తాను' అని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. శుక్రవారం ఆమె యర్నగూడెం లోని క్యాంపు కార్యాలయంలో 'సాక్షి'తో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తనకు తెలుసునన్నారు. వాటిని ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తానని చెప్పారు. పక్కా లోకల్ అయిన తాను రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చానన్నారు. తన తండ్రి జొన్నకూటి బాబాజీ రావు రెండు పర్యాయాలు ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారని ఆమె అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచి రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానన్నారు. గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొంది రెండు నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేశానని వనిత తెలిపారు. 20 ఏళ్ల పాటు ఎమ్మెల్యే పదవి తమ కుటుంబంలోనే ఉందన్నారు.

తాను కొవ్వూరు నుంచి ఇక్కడకు వచ్చినపుడు సమస్యలు స్వాగతం పలికినప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అండదండలతో వాటిని పరిష్కరించగలననే నమ్మకం ఏర్పడిందన్నారు. జగనన్న ఇచ్చిన భరోసా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సహకారంతో గోపాలపురం నియోజకవర్గాన్ని రాబోవు ఐదేళ్లలో మోడల్‌గా తీర్చిదిద్దుతానని ప్రకటించారు.

గోపాలపురంలో ఫ్యాన్ జోరు

- వెనుక బడిన సైకిల్
- ప్రచారంలో దూసుకుపోతున్న మంత్రి తానేటి వనిత
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉరకలు వేస్తున్న ఉత్సాహం
- టీడీపీలో గ్రూపు తగాదాలు


వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనితకు మద్దతుగా దేవరపల్లి మండలం యర్నగూడెంలో బైక్ ర్యాలీ


ద్వారకాతిరుమల మండలం జాజులకుంటలో తానేటి వనితకు ఉపాధి కూలీల సంఘీభావం

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ప్రచారంలో ఫ్యాన్ గుర్తు ముందంజలో ఉండగా, సైకిల్ వెనుకబడింది. ఈ నెల 13 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యనే నెలకొంది. రెండు పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని పతాక స్థాయిలో సాగిస్తున్నారు. ప్రజలు అడుగడుగునా వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు నీరాజనాలు పడుతున్నారు. ఎక్కడ చూసినా వనిత గెలుపు ఖాయమని, మెజార్టీ ఎంత వస్తుందనే దానిపైనే ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఆమె తరఫున పలువురు జోరుగా పందేలు కూడా కాస్తున్నారు. ఎన్నికల ఫలితాలపై రూ.లక్షల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసినపుడు నియోజకవర్గంలో తానేటి వనిత చేసిన అభివృద్ధి ఈ ఎన్నికల్లో ఆమెకు ప్లస్ అవుతోంది. అలాగే ఆమె తండ్రి జొన్నకూటి బాబాజీరావు గతంలో ఇదే నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేయడం కూడా కలిసొచ్చే అంశం. అలాగే వనిత 2014, 2019 ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి, 2019 ఎన్నికల్లో అక్కడ విజయం సాధించారు. ఈ ఐదేళ్ల జగనన్న ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగటంతో కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ వచ్చారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన పరిచయాలతో ప్రస్తుత ఎన్నికల్లో అందరితో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం

వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనితకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ గ్రామ, మండల కమిటీల అధ్యక్షులు, మహిళా కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఇంటింటి ఎన్నికల ప్రచారం దూకుడు పెంచారు. దాదాపు నెల రోజుల నుంచి ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులు కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. భర్త, డాక్టర్ తానేటి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు ఆమెకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. బీసీ, ఎస్సీ సంఘాల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ అన్నివర్గాల వారినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు.

టీడీపీలో అంతర్గత పోరు

టీడీపీలో అంతర్గత పోరు కొనసాగుతోంది. ఆది నుంచి టీడీపీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావును పార్టీ అధిష్టానం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది. అనంతరం 2022లో ముప్పిడి వెంకటేశ్వరరావును ఇన్‌చార్జిగా తొలగించి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన మద్దిపాటి వెంకట్రాజుకు ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు మధ్య వర్గ పోరు మొదలైంది. ముప్పిడికి మద్దతుగా పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు నిలబడ్డారు. మద్దిపాటిని అడుగడుగునా ముళ్లపూడి వర్గం అడ్డుకుంటూ వచ్చారు. ముప్పిడి వెంకటేశ్వరరావును కొవ్వూరు అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించడంతో ముప్పిడి, మద్దిపాటి మధ్య వివాదం సద్దు మణిగినప్పటికీ ముళ్లపూడి బాపిరాజు మద్దిపాటిని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఇటీవల నల్లజర్ల యువగళం రోడ్ షోకు వచ్చిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి ముందు బాపిరాజు వర్గం నిరసన తెలిపింది. చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌ను అడ్డుకుని ఆందోళన చేయడంతో అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. చంద్రబాబు ఆదేశాల మేరకు ముళ్లపూడి బాపిరాజు మద్దిపాటితో ప్రచారంలో పాల్గొంటున్నారు. అయితే ఆయన అనుచరులు అంతగా కార్యక్రమాల్లో పాల్గొనకపోవడంతో అంతర్గతంగా విభేదాలు కొనసాగుతున్నాయని పార్టీ శ్రేణులు అంటున్నారు.

వనిత విజయం నల్లేరు మీద నడకే..

వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత గెలుపు తథ్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చిన వనితకు నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణులతో, ప్రజలతో ఉన్న పరిచయాలు ఆమె విజయానికి దోహదపడతాయని అంటున్నారు. వైఎస్సార్ సీపీలోనే కాకుండా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకుల మద్దతు కూడా అంతర్గతంగా ఆమెకు ఉంది. దీంతో పాటు రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పోటీలో ఉన్నందున బీసీ వర్గాల మద్దతు కూడా వైఎస్సార్ సీపీకి లభిస్తోంది.

13న వ్యాపార, వాణిజ్య సంస్థలకు సెలవు

కొవ్వూరు: ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం–1948 ప్రకారం ఆ రోజున వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించినట్టు కొవ్వూరు సహాయ కార్మిక కమిషనర్ సీహెచ్ ఆలోచన శుక్రవారం తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో పాటు ఇతర సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ప్రకటించినట్టు కార్మిక శాఖ సహాయ అధికారి బి.లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆయా సంస్థల యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల డీఎస్పీ బి.ఆదినారాయణ తెలిపారు. మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, డి.ముప్పవరం గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ కేంద్రాల్లో స్పెషల్ బలగాలతో పాటు వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేస్తామన్నారు. ఎస్సై రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పథకాలకు టీడీపీ మోకాలడ్డు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- తోగుమ్మి గ్రామంలో ఎన్నికల ప్రచారం


కొవ్వూరు మండలం తోగుమ్మి ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

కొవ్వూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఐదేళ్లగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ఆర్థిక చేయూతను ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ఇప్పుడు అందకుండా టీడీపీ అడ్డంకులు సృష్టిస్తోందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు విమర్శించారు. మండలంలోని తోగుమ్మి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. జగనన్న పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తుంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే దుర్బుద్ధితో చంద్రబాబు కుటిల రాజకీయాలకు తెర లేపారన్నారు. మే 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ద్వారా చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. తలారి ప్రచార రథానికి ముందు భాగాన వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు ఉప్పులూరి సూరిబాబు, మాజీ సర్పంచ్ ఆరుగొలను రాజు తదితరులు పాల్గొన్నారు.

తలారికి మద్దతుగా ప్రచారం

చాగల్లు: వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, మల్లవరం, దారవరం, నందిగంపాడు, చిక్కాల తదితర గ్రామాల్లో శుక్రవారం వారు ప్రచారం చేశారు. కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు మద్దతుగా చాగల్లులో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్, మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్ తదితరులు ప్రచారం చేశారు. అలాగే మార్కొండపాడులో ఎంపీపీ మట్టా వీరాస్వామి, సొసైటీ అధ్యక్షుడు గంగిశెట్టి వాసు, బ్రాహ్మణగూడెంలో ఆ పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, చిక్కాల, చిక్కాలపాలెం గ్రామాల్లో సర్పంచ్ కొయ్యే మణి, సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, ఉప సర్పంచ్ తాతా శ్రీహరి తదితరులు ప్రచారం చేశారు.

వేగేశ్వరపురంలో పాదయాత్ర

తాళ్లపూడి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో గ్రామంలో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు బ్యాలెట్‌లు అందజేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తలారి వెంకట్రావు ,లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. అలాగే పోచవరంలో పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలోను, పెద్దేవంలో తోట రామకృష్ణ ఆధ్వర్యంలోను ప్రచారం చేశారు.

మచ్చలేని రాజకీయ వేత్తను

- మరోసారి ఆదరించండి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు
- తీపర్రు, ఉసులుమర్రు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


తీపర్రులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ప్రజా జీవితంలో 30 ఏళ్లుగా అవినీతి మరక లేకుండా రాజకీయాలు చేస్తున్నానని, మరోసారి అవకాశం ఇస్తే మోడల్ నియోజకవర్గంగా నిడదవోలును తీర్చిదిద్దుతానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు విన్నవించారు. మండలంలోని తీపర్రు, ఉసులుమర్రు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఆయన ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారంలో అడుగడుగునా హారతలు, పూలాభిషేకాలతో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ ప్రాంతం, మీ ఊరు, మీ ఇంటి అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. ఈ ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే ఓటి వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుందుల భూపతిరావు, రామడుగుల సూర్యనారాయణ, దొవులూరి శ్రీను వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మునిసిపల్ చైర్మన్ ప్రచారం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆ పార్టీ శ్రేణులతో కలసి శుక్రవారం పట్టణంలోని బసివిరెడ్డి పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రజలకు వివరించారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాసనాయుడిని, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో మాగాపు మాధవరావు, రాంబాబురెడ్డి, అడపా రాజు, వడ్డి రాజేష్, గనిశెట్టి వీరబాబు, గనిరెడ్డి చక్రం, సత్తి రెడ్డి, గూడా ప్రసాద్, మాకిరెడ్డి శ్రీను, అంగులూరి సంతోష్, నాగళ్ళ శ్రీను, టేకు రాజు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

ఎన్నికల ప్రచారంలో హోం మంత్రి తానేటి వనిత


ప్రకాశరావుపాలెం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మళ్లీ అధికారంలోకి తీసుకు రావాలని వైఎస్సార్ సీపీ గోపాలపురం అసెంబ్లీ అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రకాశరావుపాలెంలో శుక్రవారం రాత్రి మంత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ముత్తిన నరేష్, కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం, భారీ బైక్ ర్యాలీ జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి తన ప్రసంగంలో గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. ఫ్యాను గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

బుధవారం రాత్రి నల్లజర్లలో టీడీపీ నాయకులు జరిపిన దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను శుక్రవారం హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీకు, మీ కుటుంబాలకు తాను అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. గాయపడ్డ ఆరుగొల్లు వెంకటేష్, నల్లజర్ల–1 సచివాలయంలో పని చేసిన మాజీ వలంటీర్లు తేలు ఇందు, గుడిశే సుదర్శనంలను మంత్రి పరామర్శించారు.

ఆటోనగర్ ఏర్పాటు చేస్తా

'సాక్షి'తో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు


శ్రీనివాస్‌నాయుడు ఎమ్మెల్యే అభ్యర్థి

నిడదవోలు: ఈ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందితే రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఈ పరిసర ప్రాంతాల్లోని 500 ఆటో మొబైల్ షాపులు, ఇతర పనులపై ఆధారపడిన 1500 కుటుంబాలకు అండగా ఆటోనగర్ ఏర్పాటు చేస్తానన్నారు. నిడదవోలు పట్టణంలో మినీ స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. పట్టణం నుంచి మండలంలోని కోరుమామిడి వరకూ ఆర్ అండ్ బీ స్టేట్ హైవేను నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేసి, సెంట్రల్ డివైడర్‌లు ఏర్పాటు చేస్తానని శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. యువతకు ఉపాధి కల్పనకు వీలుగా నిడదవోలు, కోరుమామిడి స్టేట్ హైవేను ఆనుకుని పలు పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. పట్టణంలో కూలిపోయిన పురాతన వంతెన స్థానంలో రూ.4.65 కోట్ల వ్యయంతో కొత్త వంతెన నిర్మాణానికి అన్ని చర్యలు చేపడతానన్నారు. నిడదవోలులోని షాదీఖానాను ఆధునీకరిస్తానని చెప్పారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. దీని కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.6 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.